క్లుప్తంగా

రోడ్డు నిర్మాణం వేగవంతం చేయాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలో రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని 51, 53 డివిజన్ల కార్పొరేటర్లు మరుపిళ్ల రాజేష్, మహాదేవు అప్పాజీరావు అన్నారు. కొత్తపేట గణపతిరావురోడ్డులో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం కార్పొరేటర్లు రాజేష్, అప్పాజీరావు పరిశీలించారు. రోడ్డులోని ఒక వైపు పనులు పూర్తి కాగా రెండో మార్గంలో పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిశీలించిన కార్పొరేటర్లు నాణ్యతా ప్రమాణాలు దెబ్బతినకుండా పనులను వేగవంతం చేయాలని సూచించారు. త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

మజ్జిగ పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): కనకదుర్గమ్మ దర్శనార్థం ఇంద్రకీలాద్రిపైగల శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానానికి విచ్చేసే భక్తుల దాహార్తిని తీర్చేందుకు ప్రతి రోజూ మజ్జిగ పంపిణీ చేస్తున్న క్రమంలో శుక్రవారం మజ్జిగ అందజేశారు. వేసవి కాలం సందర్భంగా నిర్వహిస్తున్న మజ్జిగ పంపిణీకి ఈ రోజు దాత గార్లపాటి సూరిబాబు సహకారాన్ని అందజేశారు. ఆలయ ట్రస్ట్ బోర్డ్ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కర్నాటి రాంబాబు, సభ్యులు అనుమోలు ఉదయలక్ష్మి పాల్గొన్నారు.

నేడు, రేపు చదరంగంపై అవగాహన

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ బందరు రోడ్డులోని పీవీపీ మాల్‌లో ఈ నెల 27, 28 తేదీల్లో ఉచితంగా చెస్ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు గ్లోబల్ చెస్ అకాడమీ కార్యదర్శి, ఫిడే ఇన్‌స్ట్రక్టర్ షేక్ ఖాసీం తెలిపారు. ఆయా తేదీల్లో సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ఈ వర్క్‌షాప్ జరుగుతుందని పేర్కొన్నారు. అవగాహన సదస్సులో పాల్గొనే వారికి సీనియర్ చెస్ కోచ్‌లతో శిక్షణ ఇస్తామని తెలిపారు. చదరంగంలో రాణించాలనే ఆకాంక్ష ఉన్న క్రీడాకారులు తమ అకాడమీ ఆధ్వర్యంలో జరిగే ఈ అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 98495 14138ను సంప్రదించాలని కోరారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: హృదయాంజలి బ్లోజమ్స్ ఆధ్వర్యంలో సినీ నటుడు ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. డాక్టర్ అమలారాణి ఆధ్వర్యంలో గాయనీ గాయకులు సత్యవర్ధన్, సునీల్, డేవిడ్‌రాజు, రమాశంకర్, రామభద్రకుమార్, సింధు, డాక్టర్ భాగ్యశ్రీ పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు. సినీ రంగ ప్రముఖులు నటుడు శరత్‌బాబు, సినీ సంగీత దర్శకుడు రాజ్ మృతికి సంస్థ నిర్వాహకులు సంతాపం ప్రకటించారు. సేవా రంగంలో ఈటీవల డాక్టరేట్ పొందిన సీనియర్ గాయని అమలారాణిని నిర్వాహకులు అభినందించారు. సినీ రంగస్థల నటుడు కొప్పుల ఆనంద్ నిర్వహించారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు డాక్టర్ పరచూరి విజయలక్ష్మి, నరసింహారావు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్య సేవా శిబిరం

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని శ్రీకామాక్షి విశ్వబ్రాహ్మణ కల్యాణ మండప సంఘం వారి పుల్లేటికుర్తి ప్రసాద్, అన్నపూర్ణమ్మ కల్యాణ మండపం ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన ఉచిత మెగా వైద్య సేవా శిబిరం నిర్వహించనున్నట్లు కల్యాణ మండపం గౌరవ సలహాదారు జవ్వాది కూర్మాచార్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వర్ణకారులు, వారి కుటుంబసభ్యులు, స్థానికుల ప్రయోజనార్థం ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విజయవాడ సూర్యారావుపేటకు చెందిన ఎంజే నాయుడు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యుల నేతృత్వంలో ఎముకలు, కీళ్లు, నరాలు, కండరాల సమస్యలపై పరీక్షలు చేస్తారని తెలిపారు. ఎంజే నాయుడు హాస్పిటల్ ఫౌండేషన్ గౌరవ చైర్మన్ వావిలాల రజనీకాంత్ శర్మ పర్యవేక్షణలో ఈ వైద్య సేవా శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.







● ఆత్మీయ సత్కారం

గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెంకటపాలెం వద్ద శుక్రవారం ఇళ్ల పట్టాల పంపిణీ కోలాహలంగా జరిగింది. విజయవాడ కార్పొరేషన్ పరిధిలోని మూడు నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున లబ్ధిదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లా, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ఈస్ట్ సమన్వయకర్త దేవినేని అవినాష్, తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయ సత్కారం చేశారు. తొలుత ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ సంపత్‌కుమార్ సీఎంకు ఆత్మీయ స్వాగతం పలికారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



నేడు వలంటీర్లకు అవార్డ్‌ల ప్రదానోత్సవం

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 9.30 గంటలకు పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 46, 47, 48, 49, 50 డివిజన్ల పరిధిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వార్డ్ వలంటీర్లకు సేవా మిత్ర, సేవ రత్న, సేవ వజ్ర అవార్డ్‌ల ప్రదానోత్సం జరుగుతుంది. 46వ డివిజన్‌లోని డాక్టర్ కెఎల్ రావు పార్క్ వద్ద నిర్వహించనున్న ఈ అవార్డ్ ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి హాజరు కానున్నారు. అలాగే ఆయా డివిజన్ల కార్పొరేటర్లుకూడా పాల్గొంటారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11కేవీ హైవే ఫీడర్ లైన్ల మరమ్మతులలో భాగంగా కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఆశ్రమం రోడ్, బేతపూడి అరుణకుమారి రోడ్, బాజీబాబా మందిరం రోడ్, సభాపతి రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

జగన్ ప్రభుత్వంలో హిందూ ధర్మానికి పెద్ద పీట

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో హిందూధర్మానికి పెద్ద పీట వేసినట్లు పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. కొవ్వూరు శ్రీరామానంద గౌడీయ మఠం ఆధ్వర్యంలో పాతబస్తీలోని మద్ది సుబ్బారావు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రాంగణంలో కోటి శ్రీకృష్ణ నామ జప యజ్ఞం కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభకు వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దైవభక్తితో సమాజం సుసంపన్నం కావాలన్నారు. వారం రోజుల పాటు కోటి శ్రీకృష్ణ నామ జప యజ్ఞం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించేందుకు తద్వారా సమాజంలో శాంతిని పరిరక్షించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పాతబస్తీలో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించే దిశగా ఈ విధమైన కార్యక్రమాలు తరచూ నిర్వహించడం సంతోషకరమన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ న్యాయవాది వేముల హజరత్తయ్యగుప్తా మాట్లాడుతూ మానవ జన్మ ఉత్కృష్టమైనదని, దానిని సార్థకం చేసుకోవాలన్నారు. వారం రోజుల పాటు జరిగే కోటిజప యజ్ఞంలో భారీగా ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. పీఠాధిపతి శ్రీవామన మహారాజ్ స్వామి మాట్లాడుతూ వారం రోజుల పాటు జరిగే కార్యక్రమ వివరాలను వివరించారు. ఆధ్యాత్మిక చింతన అవశ్యకతను వివరించారు. సభానంతరం నామ సంకీర్తన, ప్రసాద వితరణ జరిగింది. కమిటీ ప్రముఖులు నంబూరి శ్రీహరి, ఉమామహేశ్వరరావు, కొల్లిపర బాబు, విజయకుమార్, తెలప్రోలు రావు గారు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు

అమ్మవారికి కళాకారుల నృత్య నీరాజనాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించే ధర్మపథం సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా కళాకారులు తమ నృత్య ప్రదర్శనలతో అమ్మవారికి నృత్య నీరాజనాలు సమర్పించారు. నటరాజ నృత్య కళానిలయం నిర్వాహకురాలు నాట్యాచారిణి కె స్వాతి వాహిని శిష్య బృందం ప్రదర్శించిన వివిధ అంశాలు భక్తులను తన్మయులను చేశాయి. సంప్రదాయ కళల్లో ప్రసిద్ధి చెందిన కూచిపూడి నృత్యం ద్వారా వినాయక కౌతం, బ్రహ్మాంజలి, మహిషాసురమర్దని, శంకర శశిధర, మూషిక వాహన, చూడ రండమ్మ సతులార, రామాయణ శబ్దం తదితర అంశాలను చక్కని హావభావాలతో నర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం దేవదాయ శాఖ ద్వారా ధర్మపథం పేరుతో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని భక్తులు కొనియాడారు.



చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అమరావతి ప్రాంతంలో పేదలకు ఇంటి స్థలాలు కేటాయించిన ఈ రోజు చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ రోజు అని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దాడి జగన్ అన్నారు. దాడి జగన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమం శుక్రవారం కింగ్ హోటల్ సెంటర్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతిలో పేదలకు ఇళ్ల కేటాయింపు కార్యక్రమాన్ని చూసి జనసేన నేత పోతిన మహేష్, ఇతర టీడీపీ నేతలకు కడుపు ఉబ్బరంగా ఉందన్నారు. చంద్రబాబు బినామీలకు నిద్రపట్టడం లేదన్నారు. పేదలకు మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలందరూ అండగా ఉంటారని వివరించారు. సింహాచలం దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితురాలు దాడి దేవి, నాయకులు పైడాడ శ్రీనివాసరావు, బత్తుల పాండు, కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, చక్రవర్తి, పేర్ల సాయిరాం బీసీ నాయకులు సురేశ్ రెడ్డి, చందు సప్పా శ్రీను పాల్గొన్నారు.



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డికి కృతజ్ఞతలు

గన్నవరం: రాష్ట్ర ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా గృహ, వాణిజ్య అవసరాలకు, వ్యవసాయ బోర్లకు, పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్న రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విమానాశ్రయంలో పెద్దిరెడ్డిని కలిసిన పార్టీ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, కార్పొరేటర్ బి.జానారెడ్డి తదితరులు అభినందన లేఖను అందజేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రోజుకు రెండు నుంచి మూడు సార్లు గృహాలకు విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడిపోయారని చెప్పారు. వారానికి ఒకరోజు పవర్ హాలిడే ప్రకటించడం వల్ల ఉత్పత్తులు చేయలేక పరిశ్రమలు మూత పడే పరిస్థితి ఉండేదన్నారు. వ్యవసాయానికి సరైన సమయంలో విద్యుత్ సరఫరా చేయకుండా రైతులను టీడీపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసిందని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత నాలుగేళ్లుగా నిత్యం అధికారులతో సమీక్షలు జరుపుతూ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా నిప్పులు చెరిగే ఎండాకాలంలో కూడా అవసరానికి మించి విద్యుత్ ఉత్పత్తి చేయడంతో పాటు ప్రజలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డితో పాటు ఆ శాఖ అధికారులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏజీఎంకు వినతి

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ డివిజన్ పర్యటలో ఉన్న దక్షిణ మధ్య రైల్వే ఏజీఎం ధనుంజయులకు రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలన కోరుతూ దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ సీ అండ్ డబ్ల్యూ హెడ్ క్వార్టర్స్ బ్రాంచ్ కార్యదర్శి కె.సుకుమార్ వినతిపత్రం సమర్పించారు. కోచింగ్ డిపో పర్యటకు శుక్రవారం రాగా ఎంప్లాయిస్ సంఘ్ నేతలు ఆయన్ను శాలువాలతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుకుమార్ మాట్లాడుతూ డిపోలో ప్రైమరీ మెయింటినెన్స్ నిర్వహిస్తున్న ధర్మవరం ఎక్స్‌ప్రెస్ మచిలీపట్నం తరలివెళ్లిందని, అమరావతి ఎక్స్‌ప్రెస్ మరి కొన్ని రోజుల్లో నర్సాపూర్ వెళ్లనుందని, సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ కూడా వేరే డిపోకు తరలివెళ్లిపోతుందని పేర్కొన్నారు. దీంతో కోచింగ్ డిపోలో కార్మికుల నిర్వాహణకు సరిపడా కొత్త రైళ్లను కేటాయించాలని వినతిపత్రంలో ఏజీఎంను కోరినట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రయాణికుల డిమాండ్ మేరకు ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న విజయవాడ-అజ్మీర్, విజయవాడ-వారణాసి, విజయవాడ-నాగపట్నంకు రైళ్లను కేటాయించాలని, నిర్మాణం పూర్తి చేసుకున్న కోచింగ్ మెయింటినెన్స్ డిపోలో స్టాఫ్ రూమ్, క్యాంటిన్, తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించాలని, 13 సంవత్సరాలుగా అసిస్టెంట్స్‌గా ఉన్న హెల్పర్, కళాసీలకు టెక్నీషియన్-3 పదోన్నతులు కల్పించాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఏజీఎం కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శులు మణికుమార్, ఫణి రాజ్‌కుమార్, బీఈసీ సభ్యులు వెంకటేశ్వరరావు, రాము పాల్గొన్నారు.



ఏజీఎం ధనుంజయులకు వినతి పత్రం సమర్పించిన ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వరస్వామిని శుక్రవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో తెల్లవారుజామున ఆరు గంటల నుంచే భక్తులతో ఇంద్రకీలాద్రి కిటకిటలాడింది. శుక్రవారం సందర్భంగా ఆదిదంపతులకు నిర్వహించిన నిత్య ఆర్జిత సేవలైన అమ్మవారి లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవావరణార్చన, చండీ హోమం, శాంతి కల్యాణం తదితర సేవలలో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు అంతరాలయంలో అమ్మవారికి జరిగే ఖడ్గమాలార్చన వైభవంగా నిర్వహించారు. మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా అమ్మవారిని దర్శించుకోవడంతోపాటు ప్రత్యేక పూజల్లో పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

కిటకిటలాడిన క్యూలు

అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో క్యూలు కిటకిటలాడాయి. మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గంతోపాటు పాత మెట్ల మార్గంలో మెట్ల పూజలు జరుపుకున్న భక్తులు సర్వ దర్శనంతోపాటు వివిధ రేట్లలో ఉన్న టికెట్లను కొనుగోలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులతో క్యూ లైన్ మహా మండపం 5వ అంతస్తు వరకు, అలాగే ఘాట్ రోడ్‌లో టికెట్ల కౌంటర్ వరకు రద్దీగా కనిపించాయి. 11.40 గంటలకు అన్ని దర్శనాలు నిలిపివేశారు. మధ్యాహ్నం 12.20 గంటలకు అన్ని దర్శనాలు తిరిగి ప్రారంభమయ్యాయి. సాయంత్రం అమ్మవారికి నిర్వహించిన పంచహారతుల సేవ, పల్లకి సేవ, దర్బారు సేవల్లోనూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



చండీ హోమం చేస్తున్న వేద పండితులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు



జస్టిస్ రామకృష్ణప్రసాద్‌కు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేస్తున్న చైర్మన్ రాంబాబు



కమిషనర్ సత్యనారాయణకు అమ్మవారి శేషవస్త్రాన్ని అందజేస్తున్న కోటేశ్వరరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారిని పలువురు ప్రముఖులు శుక్రవారం దర్శించుకున్నారు. హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్ అమ్మవారి ఆలయానికి విచ్చేయగా ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం అందచేశారు. జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ అమ్మవారి పంచహారతుల సేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డ్ సభ్యురాలు అనుమోలు ఉదయలక్ష్మి పాల్గొన్నారు. దేవదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్, సెక్రటరీ శ్రీరాము సత్యనారాయణ విచ్చేయగా ఆలయ కార్యనిర్వాహక ఇంజినీర్ కెవీఎస్ కోటేశ్వరరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు.

4 నుంచి యోగా శిక్షణ తరగతులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఆవరణలోని తమ అసోసియేషన్ హాల్లో ఈ శిక్షణ తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు.

● వర్షంతో హర్షం

విజయవాడలో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎండ తీవ్రంగా ఉండడంతో నగరవాసులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం నాలుగు గంటలకు ఒక్కసారిగా వాతావరణంలో మార్పు రావడంతో పాటు జోరున వర్షం కురవడంతో నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తూ సేదతీరారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



పార్సిల్ వ్యాపారులతో పీసీసీఎం సమావేశం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పీసీసీఎమ్) కె.రవీన్‌కుమార్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం విజయవాడ రైల్వే స్టేషన్‌లోని విఐపీ లాంజ్‌లో పార్సిల్ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ముందుగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో రైల్వే ఆదాయంలో అత్యుత్తమ సహకారం అందించినందుకు గాను పార్సిల్ వ్యాపారులకు ధన్యవాధాలు తెలియజేశారు. ఇదే స్ఫూర్తితో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా తమ సహకారం అందించాలని కోరారు. డిమాండ్ మేరకు ఈశాన్య ప్రాంతాలతో పాటు హౌరాకు సరుకు రవాణ చేయడానికి తగినన్ని రేక్‌లు ఏర్పాటు చేయాలని వ్యాపారులు ఆయన దృష్టికి తీసుకురావడంతో దాని పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎస్ఎల్ఆర్, పార్సిల్ వ్యాన్లలో ఎక్కువ స్థలం కావాలని వ్యాపారులు కోరుతున్న దృష్ట్యా ఇతర జోన్‌లు, డివిజన్లలో కౌంటర్ పార్ట్‌లతో సమన్వయం చేసుకుని కార్యాచరణ రూపొందించుకోవాలని అధికారులకు సూచించారు. ప్రయాణికుల భద్రత, రైళ్ల సమయపాలనకు అధిక ప్రాధాన్యతతో పార్సిల్ కార్యకలాపాలు సాగించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం విజయవాడ స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యాలను పరిశీలించారు. టికెట్ చెకింగ్ లాబీని తనిఖీ చేసి హెచ్‌హెచ్‌టీ మిషన్ల పనితీరును సమీక్షించారు. సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు, సీనియర్ డీఓఎం నరేంద్ర వర్మ, డీసీఎం ఎండీ అలీఖాన్, స్టేషన్ డైరెక్టర్ పీబీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.